28న మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి -వరదయ్యపాలెం

శ్రీసిటీలోని శ్రీరామచంద్రా మెడికల్ సెంటర్ (ఎస్ఆర్ఎంసి), శ్రీసిటీ ఫౌండేషన్, పాండూరు శ్రీకోదండరామ స్వామి సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 28న ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వరదయ్యపాళెం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం జరగనుంది. ఇందులో జనరల్ మెడిసిన్ (సాధారణ వ్యాధులు), గైనకాలజీ (స్త్రీ సంబంధిత వ్యాధులు), డెర్మటాలజీ (చర్మ వ్యాధులు), పిడియాట్రిక్స్ (చిన్న పిల్లల వైద్యం), ఆర్థోపెడిక్స్ (ఎముకులు, కీళ్ల సమస్యలు) సంబంధించి ప్రత్యేక వైద్య నిపుణుల బందం వైద్య సేవలు అందిస్తారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇతర వివరాలకు 9080605607, 08576-293329 సంప్రదించవలసినదిగా కోరారు.

'చేనేత'కు దక్కని 'చేయూత'

విస్తృత మార్కెటింగ్ కల్పించాలి

కూనా మల్లికార్జున్, చేనేత రాష్ట్రపతి అవార్డు గ్రహీత

చేనేత ఉపవత్తిదారుల ఆదాయం పెరిగేలా ప్రభుత్వం దృష్టిసారించాలి. మగ్గంపై కార్మి కుడు పనిచేస్తేనే వీరికి జీవనోపాధి దొరుకు తుంది. చేనేత వస్త్రాలకు మెరుగైన మార్కె టింగ్ సదుపాయం కల్పిస్తే ప్రయోజనం ఉంటుంది.

ప్రజాశక్తి - డక్కిలి

కేంద్ర బడ్జెట్లో చేనేత రంగానికి మళ్లీ నిరాశే మిగిలింది. 2024- 25కూ కేంద్ర ప్రభుత్వం రూ.200 కోట్లనే కేటాయించింది. చేనేత రంగంలో ఉన్నవారికి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పదికి పైగా పథకాలున్నప్పటికీ ఒక్క జాతీయ చేనేత అభివద్ధి కార్యక్రమం (ఎన్హెచ్డిపీ)కు మాత్రమే ఈ నిధులను నిర్దేశించింది. చేనేత, జౌళి, హస్తకళలతో కూడిన మొత్తం బడ్జెట్ రూ.4,392.85 కోట్లు కాగా, అందులో 4.5 శాతం మేరకు చేనేతకు నిర్దేశించారు. చేనేత రంగానికి గత మూడేళ్లుగా కేటాయింపులు సుమారు రూ.200 కోట్లుగానే ఉన్నాయి. ప్రస్తుత (2023-24) ఆర్థిక సంవత్సరానికీ బడ్జెట్ కేటాయింపులు రూ.200 కోట్లు కాగా.. సవరణ బడ్జెట్లో దానిని రూ.190 కోట్లకు కేంద్రం తగ్గించింది. కేటాయించిన నిధులను సైతం ఎంతమేర ఖర్చు పెడుతుందో ఎవరికి అర్థం కాని పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేనేతలకు అమలు చేస్తున్న చేనేత కార్మికుల సమగ్ర సంక్షేమ పథకం, నూలు సబ్సిడీ, చేనేత సమూహ అభివద్ధి పథకం, భారీ సమూహ పథకం, సేవాకేంద్రం, మ్యూజియం, సౌకర్యాల కల్పన వంటి ఇతర పథకాలకు వరుసగా మూడో ఏడాదీ నిధులు కేటాయించలేదు. బడ్జెట్లో ఈ పథకాలున్నట్లు పేర్కొన్నప్పటికీ నిధుల కేటాయింపులు లేకపోవడంతో ఇవి నామమాత్రంగా నే మిగిలిపోనున్నాయి. 1985 చేనేత ఉత్పత్తుల పరిరక్షణ పథకం అమల్లో ఉన్నట్లు ప్రకటించిన కేంద్రం దానికి నిధులు కేటాయించలేదు. కష్టానికి తగ్గ ఫలితం లేదు... ఎంతో నైపుణ్యంతో మగ్గంపై చేనేత వస్త్రాన్ని తయారుచేసే కార్మికులకు కష్టానికి తగ్గ ఫలితం రావడం లేదు. ఇక చేనేత ఉప వత్తులపై ఆధారప డిన మహిళా కార్మికులకు పూట గడవడమే కష్టంగా మారింది. దీంతో చేసేది లేక ఇతర పనులకు వలస వెళుతున్నారు. చేనేత పేరు చెప్తే ముందుగా గుర్తు వచ్చే వెంకటగిరి తో పాటు తిరుపతి జిల్లాలోని పుత్తూరు, నారాయణవనం తదితర ప్రాంతాల్లో మగ్గాలు క్రమేపీ తగ్గుతూ వస్తున్నాయి. వెంకటగిరిలో దశాబ్దం క్రితం ఐదు వేల మగ్గాల వరకు ఉండేవి. అయితే ప్రస్తుతం 2520 మగ్గాలే ఉన్నాయి. జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉందని నేత కార్మికులు చెబుతున్నారు. కులవత్తిపై మమకారంతో నేటికీ మగ్గాలపై జీవనం సాగిస్తున్న నేత కార్మికులు ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా వీరు వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్లూ తయారు చేస్తున్నా మార్కెటింగ్ సదుపాయం లేక కష్టానికి తగ్గ ఫలితం దక్కడం లేదు. రోజూ 18 గంటలు కష్టపడినా నెలకు రూ.10 వేలకు మించి రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహిళా కార్మికులకు జీవనాధారం...

చేనేత వస్త్రం తయారీకి ముందు చేనేత ఉపవత్తులపై ఆధారపడి వెంకటగిరి ప్రాంతంలో సుమారు అయిదు వేల మంది మహిళా కార్మికులు జీవనం సాగిస్తున్నారు. నూలు అద్దకం, రాట్నంతో కండెలు చుట్టడం. ఆసు తోడడం, పడుగులు, అచ్చులు అతకడం నూలుకు రంగులు దిద్దడం తదితర ఉప వత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తు న్నారు. అచ్చు అతికినందుకు రోజులు తరబడి పనిచేస్తే నెలకు రూ.3 వేలు నుంచి 4 వేలు ఆదాయం వస్తుంది. రోజు వారీ పని లేకపోతే అదీ ఉండదు. దీంతో తమపైనే ఆధారపడిన కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారిందని పలువురు మహిళలు వాపోతున్నారు

కార్పొరేట్తో చేనేతలో సంక్షోభం

ఎస్.సోమశేఖర్, చేనేత కార్మికుడు, వెంకటగిరి

వ్యవసాయ రంగం తర్వాత చేనేత వత్తి ప్రసిద్ధి చెందింది. ప్రస్తుతం చేనేత పరిశ్రమ కార్పొరేట్ విధానాల వలన సంక్షోభంలో చిక్కుకుంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేనేత పై జిఎస్టి విధించడం వలన మరింత సంక్షోభంలోకి చేనేత రంగం నెట్టబడింది. చేనేత పరిశ్రమను ఆదుకునేందుకు రాష్ట్ర బడ్జెట్లో చేనేత రంగానికి తగినంత ప్రాధాన్యం కల్పించి నిధులు కేటాయించాల్సి ఉంది. అదేవిధంగా చేనేతపై జిఎస్టిని పూర్తిగా రద్దు చేసి, చేనేత కార్మికులకు మూడు సెంట్లు స్థలములో షెడ్తో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలి. పట్టు జరీ నూలును 2021 నాటి ధరలకు తగ్గించాలి.

తిరుపతి రెడీమేడ్ షాప్ వద్ద చేనేతల నిరసన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

అహర్నిశలు కష్టపడి తమ చేత్తో రూపొందించిన చీరలను కొనుగోలు చేసి ఇప్పటివరకూ డబ్బులు చెల్లించలేదన్న ఆవేదనతో చేనేత కార్మికులు సంబంధిత షాప్ ముంగిట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. బాధితుల కథనం మేరకు... తమిళనాడులోని తిరువల్లూరు జిల్లా మధుర పాకం పంచాయతీలోని పాదరవేడు గ్రామానికి చెందిన కెవి కాంచన చేనేత చీరల తయారీదారులు తాము తయారు చేసిన చీరలను తిరపతి గాంధీ రోడ్ లోని శ్రీ తిరుపతి సిల్క్స్ అండ్ రెడీమేడ్స్ షాప్ కు అందించేవారు. 2023, ఆగస్టు 6వ తేదీ నుండి రెండు నెలల పాటు 5 లక్షల 30వేల విలువ గల చీరలను సరఫరా చేశారు. అప్పట్నుంచి ఇప్పటివరకు షాపు నిర్వాహకులు వారికి బిల్లులు చెల్లించలేదు. దీనిపై అనేకసార్లు వాళ్లు తమిళనాడు నుంచి తిరుపతికి చేరుకుని, డబ్బులు అడిగినా అదిగో ఇదిగో ఇది అంటూ కప్పదాటు సమాధానం చెప్పేవారు. దీంతో చేసేది లేక బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసి బుధవారం తిరుపతిలోని ఆ షాపు వద్ద నిరసనకు దిగారు. 24 గంటల్లో డబ్బులు కొంతమేరకు చెల్లిస్తామని చెప్పడంతో బాధితులు కాస్త నెమ్మదించారు.

షాపు ఎదుట చేనేతల నిరసన

బడ్జెట్లో స్వయం ఉపాధి రుణపరిమితి పెంపు

ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ వి.భాగ్యతేజ

పిఆర్ఎస్ఐ ఆధ్వర్యంలో బడ్జెట్పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

స్వయం ఉపాధి కోసం ప్రయత్నిస్తున్న యువతకు ప్రోత్సాహకరంగా ఎలాంటి పూచీకత్తు అవసరం లేని ముద్ర రుణాల పరిమితిని ఈ బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం పెంచిందని తిరుపతికి చెందిన ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ వి.భాగ్యతేజ తెలియజేశారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పిఆర్ఎస్ఐ) తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో తిరుపతిలోని న్యూ బాలాజి కాలనీలో గల గ్రీన్ హోమ్ డెవలపర్స్ కార్యాలయంలో బుధవారం వార్షిక బడ్జెట్-2024పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భాగ్యతేజ మాట్లాడుతూ ఈ బడ్జెట్లో ముద్ర రుణాల పరిమితిని రూ.10 లక్షల నుండి రూ.20 లక్షలకు పెంచారని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు, అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు పూర్తి, విశాఖ-చెన్నై కారిడార్ నిర్మాణం, రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ కోసం నిధులు మంజూరు చేస్తామని బడ్జెట్లో పేర్కొన్నారని వివరించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పలు ప్రోత్సాహకాలు అందించారని వెల్లడించారు. పన్ను పరిధిలోకి వచ్చే వేతనజీవులకు శ్లాబులను మార్చడం ద్వారా ఏడాదికి రూ.17,500 లబ్ధి కలుగుతుందన్నారు. ఈ బడ్జెట్లో మార్కెట్లో నగదు ప్రవాహాన్ని పెంచేందుకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. జీఎస్టీ ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా మారిందని చెప్పారు. యుపిఐ పేమెంట్ ల ద్వారా వచ్చే ఆదాయాన్ని బట్టి వ్యాపార సంస్థలను జిఎస్టి పరిధిలోకి చేర్చే అవకాశం ఉందన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతిలోని భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఈ బడ్జెట్లో ప్రకతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు నిధులు పెంచారని, ఇది శుభపరిణామమని చెప్పారు. స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ ఎస్పీ రామచంద్రరాజు మాట్లాడుతూ పిఆర్ఎస్ఐ ఆధ్వర్యంలో ప్రతి ఏటా బడ్జెట్పై అవగాహన సదస్సు నిర్వహించడం ముదావహమన్నారు. అనంతరం ఇటీవల పిఆర్ఎస్ఐ నేషనల్ కౌన్సిల్ నిర్వహించిన కవిగోష్టి కార్యక్రమంలో పాల్గొన్న ఆకాశవాణి తిరుపతి కేంద్రం మాజీ సంచాలకులు డాక్టర్ ఎ.మల్లేశ్వరరావు, రచయిత్రి శశి తన్నీరును పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ తరఫున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, చంద్రమోహన్ రావు, దుద్యాల చంద్రమోహన్, సాయికుమార్ రెడ్డి, ఆర్సికె.రాజు, మధుసూదన్, రాజేష్, ఎన్ బి సుధాకర్ రెడ్డి, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, త్రిపురసుందరి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన జేసీ శుభం బన్సల్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్గా బుధవారం ఉదయం శుభం భన్సల్ బాధ్యతలు స్వీకరించారు. 2020 ఐఎఎస్ బ్యాచ్కు చెందినవారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ శ్రీవారి చెంత కొలువైన తిరుపతి జిల్లాలో పనిచేయడం తన అదృష్టమని అన్నారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్ను మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ అభినందించారు.

తాగునీరు, పారిశుధ్యానికి ప్రాధాన్యత

నూతన కమిషనర్ నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి యాత్రా స్థలం కావడంతో ప్రజలకు తాగునీరు, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని కమిషనర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. బుధవారం కమిషనర్ ఛాంబర్లో అధికారికంగా బాధ్యతలను స్వీకరించారు. ఆమెకు మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కౌన్సిల్ సహకారంతో అధికారులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ తిరుపతి నగరాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజా ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కమిషనర్ చరణ్తేజ్రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య, ఎస్ఇ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్రెడ్డిలు అభినందనలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్లును, మేయర్ డాక్టర్ శిరీషను మర్యాదపూర్వకంగా కలిసారు.

టాస్క్ఫోర్స్ జాగిలాల పనితీరు భేష్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు జాగిలాల పనితీరును బుధవారం టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ పరిశీలించారు.. హంటర్, గంగ పేర్లు గల ఈ జాగిలాలు టాస్క్ ఫోర్సు కార్యాలయం ప్రాంగణంలో తమ పని తీరును అద్భుతంగా ప్రదర్శించాయి. ఎర్రచందనం స్మగ్లర్ల ఆటకట్టించేందుకు ఈ జాగిలాల సేవలను అదనంగా వినియోగించడంపై దష్టి సారిస్తామని ఎస్పీ తెలిపారు. టాస్క్ ఫోర్సుకు ఐదు జాగిలాలు ఉన్నాయని, రెండు తిరుపతిలోనూ, మిగిలిన మూడు కడప, రైల్వే కోడూరు సబ్ కంట్రోల్లో ఉపయోగిస్తున్నమన్నారు. అనుమానిత చెక్ పోస్టులతో పాటు, అటవీ ప్రాంతాల వైపు ప్రయాణించే వాహనాలను జాగిలాల ద్వారా తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ (ఆపరేషన్స్) సురేష్ కుమార్ రెడ్డి, జాగిలాల ట్రైనర్లు పాల్గొన్నారు.

వివక్షపై గర్జించిన జాషువా కలం

రేణిగుంటలో..

ప్రజాశక్తి - రేణిగుంట, యంత్రాంగం

కులాలపై గుర్రం జాషువా కలం గర్జించిందని వక్తలు ఉద్ఘాటించారు. జిల్లావ్యాప్తంగా నవయుగ కవి చక్రవర్తి గుర్రంజాషువా వర్ధంతి సభలు జరిగాయి. రేణిగుంట జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో సాహితీస్రవంతి, జెవివి ఆధ్వర్యంలో నిర్వహించారు. జెవివి నాయకులు ఒ.వెంకటరమణ మాట్లాడుతూ గుర్రపు జాషువా ఆశయాలను నేటి విద్యార్థులు కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీచర్లు శ్రీరాములు, విష్ణువర్ధనం, ఉమామహేశ్వరి, విజయలక్ష్మి, శ్రీదేవి, జెవివి నాయకులు కుప్పస్వామి పాల్గొన్నారు. గూడూరులో సిఐటియు కార్యాలయంలో కెవిపిఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు అడపాల ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథిగా హాజరై గుర్రంజాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సామాజిక రుగ్మతలను తన కలంతో ఎదుర్కొన్నారని కొనియాడారు. నాయకులు జోగి శివకుమార్, యాదగిరి, బివి రమణయ్య, డాక్టర్ చంద్రహాస్ పాల్గొన్నారు. బిఎన్ కండ్రిగలో అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు యువశ్రీ మురళి ఆధ్వర్యంలో జరిగింది. ఆధునిక తెలుగు సాహిత్యంలో తన పదునైన కవిత్వం ద్వారా సమాజంలోని అంటరానితనాన్ని, అసమానతలను, దురాచారాలను ప్రశ్నించారన్నారు. కల్లివెట్టు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్కుమార్ పాల్గొన్నారు. తిరుపతి బైరాగిపట్టెడలోని పిల్లపాలెం వాసుదేవరెడ్డి గ్రంథాలయంలో డిహెచ్పిఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు వి.నాగభూషణం ఆధ్వర్యంలో జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువది సుబ్బారావు పాల్గొన్నారు. కులవివక్షపై గుర్రంజాషువా తన కలంతో సమాధానం చెప్పారన్నారు. చిన్నం పెంచలయ్య, ఎస్.నాగరాజు, చిన్నం కాలయ్య, నడ్డి నారాయణ, దామోదరం, తులసిరామ్ పాల్గొన్నారు. వేమన విజ్ఞాన కేంద్రం, ఎస్కెఆర్ఎస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సంయుక్తంగా ప్రధానోపాధ్యాయులు సురేంద్ర ఆధ్వర్యంలో సభ జరిగింది. యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్బాబు మాట్లాడుతూ ఆధునిక తెలుగు కవులలో స్థానం పొందిన గొప్పకవి జాషువా అని కొనియాడారు. కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని వివక్షపై, మూఢాచారాలపై తిరగబడ్డారన్నారు. వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, నడ్డినారాయణ, గురునాథం, తలారి మహేష్ పాల్గొన్నారు. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథ్రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

బిఎన్ కండ్రిగలో..

తిరుమలలో పాము కాటుతో కూలీ మృతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం అది. కడుపుకూటి కోసం బతుకు జీవుడా అంటూ సుదూరం నుంచి వలస వచ్చారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి తమ బతుకులకు ఓ దారి చూపుతారన్న ఆశతో, చేతి కందిన కొడుకులతో కాయకష్టం చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే పాము కరచి శ్రీరాములు (48) మృతిచెందాడు. అయితే వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన తండ్రి చనిపోయాడని అతని కుమారులు మండిపడుతూ కుటుంబ సభ్యులతో ఆందోళన చేశారు. ఈ ఘటన సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.... అన్నమయ్య జిల్లాకు చెందిన శ్రీరాములు (48)కి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కుమార్తెకు వివాహం చేసి ఇంటి వద్దనే ఉంచారు. కుటుంబ పోషణ కోసం ఇద్దరు కుమారులు భార్యతో కలిసి తిరుమలకు వలస వచ్చారు. ఇద్దరు కుమారులు భార్యతో కలిసి కొండపై కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తిరుమల బాలాజీ నగర్ ఈస్ట్ పరిధిలో కూలి పనులు చేస్తుండగా శ్రీరాములును పాము కరిచింది. అతను పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు తిరుమల అశ్వని ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శ్రీరాములు మతి చెందారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ తండ్రి మతి చెందారని మతుడు కుమారులు ఆరోపించారు. మధ్యాహ్నం రెండు గంటలకు రుయా ఆసుపత్రికి తరలిస్తే ఒక గంట అయినా కనీసం వైద్య పరీక్షలు చేయలేదని, సాయంత్రం 4. 30 నిమిషాల వరకు అత్యవసర విభాగం వైద్యులు సరిగా స్పందించలేదని, అందుకే తమ తండ్రి మతి చెందాడని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఎంవో డాక్టర్ హరికష్ణ అక్కడికి చేరుకుని బాధితులను ఓదార్చారు. ఏం జరిగిందని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పాము విషం శరీరం మొత్తం పాకడంతో శ్రీరాములు మతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు రుయా ఆసుపత్రికి చేరుకొని మతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుల నిర్లక్ష్యం అంటూ కుటుంబ సభ్యులు ఆందోళన

1న కెమెరాల ఈ-వేలం

ప్రజాశక్తి - తిరుమల తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన కెమెరాలను ఆగస్టు 1న రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ- వేలం వేయనున్నారు. ఇందులో నైకాన్, కెనాన్, కొడాక్ తదితర కెమెరాలు ఉన్నాయి. ఉపయోగించిన/పాక్షికంగా దెబ్బతిన్న కెమెరాలు మొత్తం 10 లాట్లు ఈ-వేలంలో ఉంచారు. ఇతర వివరాలకు తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877-2264429 నంబరులో కార్యాలయం వేళల్లో, టిటిడి వెబ్సైట్లో సంప్రదించాలని టిటిడి పేర్కొంది.

టీటీడీకి రెండు ఎలక్ట్రిక్ స్కూటర్లు విరాళం

ప్రజాశక్తి -తిరుమల

కలకత్తాకు చెందిన మోటోవోల్ట్ సీఈవో తుషార్ చౌదరి బుధవారం రూ.2.45 లక్షలు విలువైన రెండు ఎలక్ట్రిక్ స్కూటర్లను టీటీడీకి విరాళంగా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయం ఎదుట జెఈవో వీరబ్రహ్మంకు మోటోవోల్ట్ సంస్థ ప్రతినిధులు స్కూటర్ తాళాలు అందించారు. ఈ కార్యక్రమంలో తిరుమల డిఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలకు 'అటానమస్ గుర్తింపు'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి - కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు ఇస్తూ న్యూఢిల్లీ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), జవహర్ లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ (జేఎన్టీయూ) వారు ఉత్తర్వులు జారీ చేసినట్లు డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యా ప్రమాణాలలో మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను కళాశాలలో ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దష్టిలో ఉంచుకొని వారి లక్ష్యాలకు అనుగుణంగా కళాశాలలో బోధన కొనసాగిస్తున్నామని, క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా ఇప్పటికే వేలాదిమంది విద్యార్థులు వారి జీవితాలను సుస్థిరం చేసుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల శ్రీరామ్ ఇంజనీరింగ్ కళాశాలకు ' నాక్ ఏ గ్రేడ్ ' లభించిందని, ఇప్పుడు తమ కళాశాలకు అటానమస్ గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. ఇంతటి గుర్తింపుకు కారకులైన చైర్మన్ మన్నెం రామిరెడ్డికి, కళాశాల సెక్రటరీ మన్నెం రామ సుబ్బారెడ్డికి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జయచంద్రకి, అధ్యాపక బందానికి, విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అన్నప్రసాదాలకు నాణ్యమైన బియ్యం ఇవ్వాలి : ఈవో

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలకు విచ్చేసే వేలాదిమంది భక్తులకు అందించే అన్నప్రసాదాల రుచిని పెంచేందుకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని టీటీడీ ఈవో జె. శ్యామల రావు రైస్ మిల్లర్లను కోరారు. తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో టీటీడీకి బియ్యం సరఫరా చేస్తున్న రైస్మిల్లర్లతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బియ్యం సేకరణ సమయంలో నాణ్యత ప్రమాణాలను పెంపొందించడంలో దోహదపడే అంశాలను సూచించాలని కోరారు. తద్వారా టెండర్లకు ఆహ్వానించే సమయంలో వాటిని చేర్చవచ్చు అన్నారు. త్వరలోనే వంటశాలలను ఆధునీకరిస్తామన్నారు. ఈ సమావేశంలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, అన్నప్రసాదం డిప్యూటీ ఈవో రాజేంద్రకుమార్, ప్రత్యేక అధికారి (కేటరింగ్) శాస్త్రి, ఈఈ ప్రొక్యూర్మెంట్ మురళీకష్ణ పాల్గొన్నారు.

'ఉపాధి' కూలి రూ.600 ఇవ్వాలి

ప్రజాశక్తి - నాగలాపురం

వ్యవసాయ కార్మికుల సమావేశంలో వి.నాగరాజు, జనార్ధన్

ఉపాధి కూలీలకు 200 పనిదినాలు కల్పించి, రోజు కూలి రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. తాజాగా బడ్జెట్లో 86వేల కోట్లు కేటాయించారని, అయితే ఇప్పటికే 42వేల కోట్లు ఖర్చయ్యిందని, మిగిలిన 44వేల కోట్ల రూపాయలు రాబోయే కాలానికి సరిపోదని, తక్షణమే నిధులు పెంచాలన్నారు. కావాలనే ఏటా ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ నిర్వీర్యం చేస్తోందన్నారు. బుధవారం నాగలాపురంలోని సుందరయ్యనగర్లో వ్యకాసం సమావేశం జరిగింది. రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ మాట్లాడుతూ రైతాంగానికి గిట్టుబాటు ధరలపై చట్టం చేయకుండా రైతులను మోసగించే పద్ధతిలో పథకాలు అమలు చేస్తున్నారన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నాగలాపురం పంచాయతీలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా బాలాజీ, ధనమణి ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా సుబ్బమ్మ, అమృత, సహాయ కార్యదర్శిగా జీవమ్మ, పద్మ, కార్యవర్గ సభ్యులుగా గౌర్యాబీ, వల్లెమ్మ, దక్షిణామూర్తి, అను, సుభాని ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సుందరయ్య కాలనీలో కరెంట్, పారిశుధ్య సౌకర్యం, వీధులు, పక్కా ఇళ్లు మంజూరుకు పోరాడాలని తీర్మానించారు.

పెద్దిరెడ్డి ఎమ్మెల్యే పదవికి ఎసరు..?

- హైకోర్టులో బిగుసుకున్న అనర్హత కేసు
- 142 ఆస్తులను అఫిడవిట్‌లో చూపకుండా దాచిన పెద్దిరెడ్డి
- పూర్తి సాక్ష్యాధారాలతో హైకోర్టులో రామచంద్ర యాదవ్ పిటిషన్..
- మదనపల్లె రికార్డుల దహనం వెనుక కారణం ఈ కేసే..?

పుంగనూరు రికార్డుల గది బయట పోలీసుల కాపల

ప్రజాశక్తి- పుంగనూరు: ఈ పిటిషన్ వేసిన రామచంద్ర యాదవ్ పకడ్బందీగా వ్యవహరించారు.. తెరవెనుక వ్యూహాత్మకంగా పావులు కదిపారు.. అత్యంత కీలకమైన ఆధారాలు సేకరించారు. పెద్దిరెడ్డిని అనర్హుడిగా చేయాలంటే కావాల్సిన అన్ని రకాల ఆధారాలు సేకరించి, పెద్దిరెడ్డి తప్పించుకునే మరో దారి లేకుండా చేసి, కోర్టులో పిటిషన్ వేశారు. అందుకే ఎన్నికలకు సంబంధించి హైకోర్టులో ఎన్ని పిటిషన్లు దాఖలైనా సీరియస్‌గా తీసుకోని హైకోర్టు ఈ పిటిషన్‌లో మాత్రం విషయం ఉండడంతో విచారణకు స్వీకరించి, ప్రతివాదులకు నోటీసులిచ్చి, ఈరోజు ఇంప్లీడ్‌కు ఆదేశించింది. 'పెద్దిరెడ్డి అఫిడవిట్ క్షుణ్ణంగా పరిశీలిస్తే ఆయన దాచిన ఆస్తులు చాలానే కనిపిస్తాయి. ఎవరూ ఏమి చేయలేరు, ఎవరూ అంత వరకు వెళ్లలేరు, ఏదైనా చేసేయొచ్చు, ఎవరినైనా మోసం చేసేయొచ్చు.. అనే ధీమాతో పెద్దిరెడ్డి అక్రమాస్తులను దాచి పెట్టారు. ఈ పిటిషన్‌లో మొత్తం ఆధారాలు అన్ని ఇచ్చాం, ఆస్తుల లెక్కలు, భూ రికార్డులు, వివరాలు అన్నీ ఇచ్చాం.. ఆ 142 భూ రికార్డులు పెద్దిరెడ్డి, ఆయన భార్య పేరిట ఉన్నవే.. అవేమి ఆయన అఫడవిట్ లో చూపించలేదు.. ఎప్పటికీ అన్యాయాన్ని గెలవనీయను.., అక్రమాలను సహించను, అరాచకాల్ని భరించను..అందుకే పెద్దిరెడ్డిపై అనర్హత వేటు పడినా నేను ఎమ్మెల్యే అవ్వను.. కానీ అక్కడ న్యాయం గెలవడం ముఖ్యం, అక్రమార్కుడు ఓటమి ముఖ్యం, పెద్దిరెడ్డి లాంటి వ్యక్తి ఎమ్మెల్యేగానే కాదు, అసలు రాజకీయాల్లోనే ఉండకూడదు' అందుకే నా పోరాటం అని రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు.

మదనపల్లె రికార్డుల దహనంకి, దీనికి లింకు..!

ఈ కేసుని పూర్తిగా పరిశీలిస్తే దీనిలో పేర్కొన్న 142 అక్రమాస్తుల వివరాలు మదనపల్లె సబ్ కలెక్టరేట్ పరిధిలోనే ఉన్నాయి. కోర్టు విషయాన్నీ సీరియస్‌గా తీసుకోవడం, ఎన్నికల అధికారి కూడా కోర్టుకి వెళ్లి సమాధానం చెప్పుకోవడంతో కేసులో సీరియస్ అంశం, సంచలన అంశం బయటకు వచ్చే అవకాశం కనిపిస్తుంది. అందుకే ఈ పిటిషన్ దాఖలైనప్పటి నుండి తప్పించుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్న పెద్దిరెడ్డి, చివరికి వేరే దారిలేక, చట్టానికి దొరకకుండా ఉండేందుకు, ఆధారాలు దొరకకుండా ఉండేందుకు మదనపల్లె సబ్ కలెక్టరేట్ లోని రికార్డులను తగలబెట్టించారనేది అనుమానించాల్సిన విషయమే. ఈ కేసులో, ఈ లింకులో మొత్తం తలదూర్చి కూపీ లాగితే కొని సంచలన నిజాలు బయటకు వచ్చే అవకాశం కనిపిస్తుంది.

> మాజీ మంత్రి.. వైసీపీ కీలక నేత పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి ఇక ఎమ్మెల్యే పదవి కూడా కోల్పోయే ప్రమాదాల్లో పడ్డారు.. ఎన్నికల అఫడవిట్‌లో ఆయన చూపని ఆస్తులను లెక్కకట్టి.. పక్కా ఆధారాలతో బీసీవైపార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ హైకోర్టులో వేసిన పిటిషన్ విచారణ ఇప్పుడు కీలక దశలో ఉంది.. బుధవారం హైకోర్టులో ఈ కేసు విచారణకు జరిగింది.. ఇరు పక్షాల న్యాయవాదులు సహా, పుంగనూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి కూడా వచ్చారు.. 'పెద్దిరెడ్డి అనర్హుడిగా మారితే.. తర్వాత స్థానంలో ఉన్న చల్లా రామచంద్రారెడ్డి ఎమ్మెల్యే అవుతారు.. ఆయన కూడా ఈ కేసులో ముఖ్యమే, ఆయనను కూడా విచారణలో భాగస్వామి చేస్తూ నోటీసులు ఇవ్వండి, ఇంప్లీడ్ చేయండి' అని హైకోర్టు ఆదేశించింది.. ఇది ఈ కేసులో కీలక పరిణామం..

స్వాతంత్ర్యం అనంతరం, జమీందారీ పాలన కాలానికి చెందిన విలువైన రెవెన్యూ ఆస్తుల రికార్డులున్న పుంగనూరు రికార్డు గది భద్రతపై ప్రజల్లో అనేక అనుమానాలున్నాయి. పూర్వపు తాలూకా కేంద్రమైన పుంగనూరు నుంచే నాటి జమీందారులు పాలన సాగించి అనేక చెరువులు, ఆలయాలు నిర్మించారు. అభివృద్ధి పనులు చేశారు. వారి అధీనంలో వేల ఎకరాల్లో భూములు ఉండేవి. విలువైన భూములు, ఆస్తులకు చెందిన రికార్డులన్నీ రాతిమసీదు వీధిలోని పుంగనూరు తహశీల్దారు కార్యాలయంలోని రికార్డు గదిలో 1948 నుంచి భద్రపరిచారు. రెవెన్యూ రికార్డులు ఎఫ్ఎల్ఆర్ (ఫేర్‌ల్యాండ్ రికార్డు), ఎస్ఎల్ఆర్ (సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డు), ఇళ్లస్థలాలు, వ్యవసాయ పొలాలు, పోరంబోకు, సెటిల్‌మెంట్ భూములు, అడవులు, దేవదాయ శాఖ, వక్ఫ్‌బోర్డు, శోత్రియం భూములు, కీ రిజిస్టర్లు, భూ సేకరణ, చెరువులు, వంకలు, కుంటలు, తదితర ముఖ్యమైన విలువైన రికార్డులు భద్రపరిచారు. జమీందారీ పాలనకు సంబంధించిన ప్రాంతాలకు చెందిన భూముల వివరాలన్నీ అందు లోనే ఉన్నాయి. గతంలో గ్రామసేవకులు (వీఆర్ఏ) తహశీల్దార్ కార్యాలయాల్లో రాత్రి డ్యూటీలు చేసేవారు. ఈ కార్యాలయానికి కాపలాగా ఉండే వారు. కొంతకాలంగా వీఆర్ఏలు ఆ పనులు చేయడం లేదు. పుంగనూరులో గతంలో రాతిమసీదు వీధిలో పూర్వం నుంచి సొంత భవనంలో తహశీల్దారు కార్యాలయం నడుస్తుండేది. కానీ అధికారుల నిర్లక్ష్యం, అవగాహన రాహిత్యం వల్ల తహశీల్దార్ కార్యాలయంలో ప్రధానమైన రికార్డు గదిని నిర్మించలేదు. దీంతో పాత కార్యాలయంలోనే విలువైన రికార్డులు అక్కడే ఉండగా, కొత్త భవనంలో తహశీల్దార్ కార్యాలయం నడుస్తోంది. ఏ ముఖ్యమైన రికార్డు కావాలన్నా పాత కార్యాలయానికి వెళ్లాల్సివస్తోంది.

పుంగనూరు రికార్డు గది సెక్యూరిటీ

మదనపల్లె ఘటన తరువాత పుంగనూరు పాత తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న రికార్డు గదికి ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. గతంలో తహశీల్దార్ కార్యాలయం రాతి మసీదులో ఉండగా నూతన ఎంపీడీవో కార్యాలయం నిర్మించిన తర్వాత దానిపైకి తహశీల్దార్ కార్యాలయాన్ని మార్చారు. తాజాగా మదనపల్లె సబ్‌కలెక్టరు కార్యాలయంలో ఆదివారం రాత్రి మంటలు చెలరేగి కీలకమైన రికార్డులు కాలిపోయాయి. ఈ ఘటనను సోమవారం పరిశీలించిన డీజీపీ ద్వారకా తిరుమలరావు ఇది ప్రమాదం కాదని స్పష్టం చేశారు. ఎవరో ఉద్దేశపూర్వకంగా కాల్చేశారని, దీని వెనుక పెద్దకుట్ర ఉన్నట్లు అర్థమవుతుంది. ఈ క్రమంలో పుంగనూరులో రికార్డుల భద్రత అంశం తెరపైకి వచ్చింది.

తలుపులు పాడై..

విలువైన రికార్డులున్న గదికి రాత్రి, పగలు కాపలా ఏర్పాటు చేయలేదు. ప్రధాన గేటు వద్ద వరండా గదికి ఉన్న ఓ తలుపు కొయ్యలు పాడైపోయి ఉంది. రికార్డు గది వెనుక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా తలుపులు అధ్వానంగా ఉన్నాయి. భద్రత లేకుండా దిక్కులేకుండా ఉన్న గదిలోని రికార్డులపై ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తుంది. గతంలో కొంతమంది అధికారులు పుంగనూరు, మరికొన్ని ప్రాంతాలకు చెందిన ముఖ్యమైన రికార్డులు మాయం చేయడం, మరికొన్ని రికార్డులు చింపివేయడం, రాజకీయ నేతల ఆదేశాలతో తప్పులు చేసినట్లు ఆరోపణలున్నాయి. పుంగనూరు పేరు రాష్ట్రంలో సంచలనాల రేపుతుండడంతో స్థానికంగా రెవెన్యూ అధికారులు మేల్కొని జిల్లాస్థాయి అధికారుల సూచనలతో రికార్డు గదికి నిఘా ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నూతన కార్యాలయంలో రికార్డుల నిల్వకు భద్రతాపరమైన ఏర్పాట్లుతో గది నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గంజాయి, రౌడీయిజాన్ని అరికట్టండి..

- హోం మంత్రికి ఎమ్మెల్యే వినతి

హోం మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నియోజకవర్గంలో గంజాయి, రౌడీయిజాన్ని పూర్తిగా అరికట్టాలని కోరుతూ రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ బుధవారం వినతి పత్రం అందించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా రాజధానికి వెళ్లిన ఎమ్మెల్యే హోం మంత్రిని కలిసి గూడూరు నియోజకవర్గంలో రౌడీయిజం, గంజాయి, మత్తు పానియాల సరఫరాను అరికట్టాలని కోరారు. లా అండ్ ఆర్డర్ సక్రమంగా పనిచేసే లా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాటంబేడు శివకుమార్, గణపర్తి కిషోర్ నాయుడు, కేతంరెడ్డి మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మనకు ఉన్నంతలో పేదలకు సేవా కార్యక్రమాలు చేసే మనస్తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఆంధ్ర మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి అన్నారు . గూడూరు ఓం శ్రీ సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో మాజీ ఇన్నర్ వీల్ క్లబ్ గూడూరు శాఖ అధ్యక్షురాలు జీవని తండ్రి వర్ధంతి సందర్భంగా ఆంధ్ర మహిళా మండలి ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధు లకు బుధవారం అన్నదానం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ నేటి కార్యక్రమానికి దాతగా వ్యవహరిస్తున్న జీవని ఆరు సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఇదే తరహాలో తమ క్లబ్ సభ్యులు పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ తనూజ, సభ్యులు పాల్గొన్నారు.

ఢిల్లీ వైసీపీ ధర్నాలో నేదురుమల్లి

ఢిల్లీ ధర్నాలో పాల్గొన్న వైసిపి నాయకుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వెంకటగిరి: ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైసీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులకు నిరసనగా వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం ఢిల్లీలో చేపట్టిన ధర్నాలో తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, పలువురు ప్రజా ప్రతినిధులు కలిసి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాలో పాల్గొని మాజీ సీఎం వైఎస్ జగన్‌కు సంఘీభావం తెలిపామన్నారు. వైఎస్ జగన్ ధర్నాకు జాతీయ స్థాయిలో మద్దతు లభించిందని తెలిపారు.

'సమగ్ర వ్యవసాయ విధానమే రైతులకు మేలు'

ప్రజాశక్తి -రామచంద్రాపురం: సమగ్ర వ్యవసాయ విధానం ద్వారా రైతుకు మంచి దిగుబడులు, ఆదాయం పొందవచ్చని ఐసిఏఆర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏఆర్‌రెడ్డి అన్నారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం పర్యవేక్షణలో భాగంగా బుధవారం కేవికే దత్తత గ్రామం మండలంలోని మిట్టూరులో రైతుల పొలా లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించి పంటలు సాగు చేయాలని రైతులను కోరారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు ఎస్ శ్రీనివాసులు దత్తత గ్రామాల్లో నిర్వహిస్తున్న వివిధ ప్రదర్శనా క్షేత్రాలు, విస్తరణ కార్యక్రమాల గురించి వివరించారు. మిట్టూరులోని రైతు పురుషోత్తం నాయుడు సమగ్ర వ్యవసాయ విధానం ద్వారా సాగు చేస్తున్న డ్రమ్ సీడర్ తో విత్తిన వరి, వేరుశనగ విత్తనోత్పత్తి క్షేత్రం, కొబ్బరి, పశుగ్రాసం, పాడి పశువుల పోషణ, గోబర్ గ్యాస్ ప్లాంటు లను సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ విధానం, సమగ్ర వ్యవసాయ విధానం ద్వారా రైతుకు సాగు ఖర్చు తగ్గి ఆశించిన ఆదాయం వస్తుందని తెలిపారు. ఆయన రైతుతో ప్రకృతి వ్యవసాయ విధానం లో వాడే వివిధ కషాయాల తయారీ, వాడే విధానం, ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డా ఏ.ఆర్. రెడ్డి, డాక్టరు ఎస్ శ్రీనివాసులు, రాస్ కెవికె సీనియర్ శాస్త్రవేత్తలు దివ్య, రామ కుమార్, మిట్టూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రోత్సాహక బహుమతులు అందజేత

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చదువుకు పేదరికం అడ్డు కాదే కాదని ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రభుత్వం, ఇటు దాతలు తమ చదువులకు సహాయ సహకారాలు అందిస్తారని పీఎల్ఆర్ గ్రాండ్ హోటల్ అధినేత లక్ష్మీపతి రెడ్డి తెలిపారు. 2023-2024 విద్యా సంవత్సరం చంద్రగిరి బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థి నులకు రెడ్డివారి లక్ష్మీపతి జ్ఞాపకార్థం ఒక్కొక్కరికి రూ.1500లు చొప్పున ఏడుగురికి రూ.10,500 ను ప్రోత్సాహక నగదును అందించారు. ద్వితీయ స్థానం సాధించిన ఏడుగురు విద్యార్థినులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున 7వేలు, విద్యలో రాణించే విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందించటానికి తాను ఎల్లవేళలా ముందు ఉంటానని లక్ష్మీపతి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి రాజశేఖర్ రెడ్డి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతరులు విద్యార్థులు పాల్గొన్నారు.

శివలక్ష్మికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థిని ఉప్పాల శివలక్ష్మికి పరీక్షల నియంత్రణ కార్యాలయం డాక్టరేట్ ను ప్రదానం చేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలోని విద్యా విభాగానికి చెందిన ఆచార్యులు పి రాణి మార్గదర్శకత్వంలో 'స్టడీ హ్యాబిట్స్, ఎడ్యుకేషనల్ అండ్ ఒకేషనల్ ఇంట్రెస్ట్ ఆఫ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు ఎగ్జామినేషన్ ఆచార్య జీవనజ్యోతి వెల్లడించారు. ఈమె పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్ లలో అనేక పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు వివరించారు. శివలక్ష్మి డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

హెల్మెట్‌తో ప్రాణ రక్షణ: ఏఎస్ఐ

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిస్తే ప్రాణాలు రక్షించుకున్నవారు అని ఏఎస్ఐ వెంకటరమణ పేర్కొన్నారు. వెంకటగిరి ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో బుధవారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు ధరించడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోర్ట్ కానిస్టేబుల్ అడ్వకేట్ రెంటాల వాసు, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర బోధనేతర సంఘం నూతన జనరల్ బాడీ కమిటీని ఇటీవల ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో పెద్ద ఎత్తున బోధనేతర సిబ్బంది హడావుడితో వర్సిటీ ప్రాంగణం హోరెత్తింది. ఇందులో 17 మంది ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శుల మిగిలిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల ఎన్నికలలో తీవ్రమైన పోటీలో అధ్యక్ష, కార్యదర్శులుగా గుర్రంకొండ శ్రీధర్, నెల్లూరు సుబ్రహ్మణ్యం గెలుపొందారు. బుధవారం ఎస్వీయూ సెనేట్ హాల్లో బోధనేతర సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుల ప్రమాణ స్వీకారం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రంకొండ శ్రీధర్, నెల్లూరు సుబ్రహ్మణ్యం లు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో బోధనేతర సంఘం సభ్యుల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు.

పుత్తూరు టౌన్: దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు కోలా పెద్ద మునెమ్మ స్పెసిఫిక్ ఎండోమెంట్ ఛారిటబుల్ ఇన్‌స్టిట్యూట్ ఆశయాలు అమలు చేయడానికి మేనేజింగ్ ట్రస్టీగా కె విటల్ బుధవారం ప్రమాణ స్వీకారం ప్రమాణ చేశారు. ఆమె మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఆశయాల అమలుకు కృషి చేస్తామన్నారు.

ఉక్కుపాదం మోపాలి

- గ్యాంబ్లింగ్, గంజాయి, నాటుసారాను అరికట్టాలి
- సైబర్ నేరాలను నిరోధించాలి
- ఫిర్యాదు దారులకు అండగా నిలవాలి
- పోలీసులకు ఎస్పి ఆదేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గ్యాంబ్లింగ్ గంజాయి, నాటు సారా, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని, నకిలీ లోన్ యాప్‌లను గుర్తించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి సైబర్ నేరాలను నిరోధించాలని ఎస్పి ఎల్ సుబ్బరాయుడు పోలీసులను ఆదేశించారు. పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీ కార్యాలయం, వడమాల పేట, పుత్తూరు అర్బన్, నారాయణ వనం, వరదయ్యపాలెం పోలీస్ స్టేషన్లు, పుత్తూరు రూరల్ సర్కిల్ సిఐ కార్యాలయాలను ఎస్పి బుధవారం తనిఖీ చేశారు. ఎస్‌హెచ్ఓ, పోలీస్ స్టేషన్ల సిబ్బంది పని తీరును సమీక్షించి జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండర్ వంటి పలు రికార్డులను పరిశీలించారు. కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లలో దీర్ఘ కాలి కంగా వున్న పెండింగ్ కేసులను అందుబాటులో ఉన్న ఆధునికి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా త్వరిత గతిన దర్యాప్తు చేసి పరిష్కరించాలన్నారు. మహిళా సంబంధిత నేరాలపై వెంటనే స్పందించి బాధితులకి సరైన న్యాయం చేయా లన్నారు. పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం, నారాయణవనం కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం, నాగలాపురం వేదనారాయణ స్వామి దేవాలయం, సురుటుపల్లి పల్లి కొండేశ్వర స్వామి దేవాలయం, సదాశివకోన దేవాలయం, అమ్మ భగవాన్ ఆధ్యాత్మిక కేంద్రాలు వున్నాయని, ఇక్కడికి యాత్రికులు అధికంగా వస్తుంటారని, హైవేలపై రోడ్డు ప్రమాదాలు నివారణకు స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఎస్‌హెచ్ఓలను ఆదేశించారు. సదాశివకోన, కైలాసకోన, సద్దికూడి మడుగు వంటి జలపాతాల సందర్శనార్థం పర్యాటకులు వస్తుంటారని, ఈ పర్యాటక ప్రదేశాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా విజిబుల్ పోలింగ్ ద్వారా ఎన్‌ఫోర్సుమెంట్ విధులు పెంచి పర్యాట కులకు రక్షణ కల్పిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించాలన్నారు. గ్రామాల్లో గ్రామ సభల ద్వారా గ్రూపు తగాదాలు అరికట్టాలన్నారు. హైవేలపై నిరంతరం అప్ర మత్తంగా ఉంటూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. వాహనాల తనిఖీ నిర్వహించి, ఎర్ర చందనం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాన్ని అరికట్టి నేరాలను నివారించాలన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలని సూచించారు. వడమాలపేట, పుత్తూరు అర్బన్, నారాయణ వనం, వరదయ్యపాలెం పోలీస్ స్టేషన్ల సిబ్బంది సమస్యలు అడిగి తెలుసు కున్నారు. ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పోక్సో చట్టం వంటి విషయాల గురించి సంబంధిత విద్యా సంస్థలు, పారిశ్రామిక ప్రాంతాలలో అవగాహన కల్పించి చైతన్య వంతులను చేసి, ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు డిఎస్పి శ్రీనివాస రావు, సీఐలు ఓబులేసు పుత్తూరు అర్బన్, భాస్కర్ నాయక్ పుత్తూరు రూరల్, ఎస్ఐలు, వడమాల పేట, పుత్తూరు అర్బన్, నారాయణవనం, పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లను తనిఖీ చేస్తున్న ఎస్పి సుబ్బరాయుడు

గంజాయి పట్టివేత.. వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గంజాయిని కల్గిన వ్యక్తిని గూడూరు సెబ్ పోలీస్‌లు అరెస్ట్ చేశారు. గూడూరు సెబ్ కార్యాలయంలో సెబ్ సీఐ రమేష్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ వాహనాల సాధారణ తనిఖీల్లో భాగంగా చిల్లకూరు మండల పరిధిలోని భూదనం టోల్ ప్లాజా వద్ద గంజాయి కల్గిన వ్యక్తిని అరెస్ట్ చేశామన్నారు. ఒడిసా కి చెందిన నంద సాహు గా గుర్తించామని అతని వద్ద వున్న సుమారు 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇతను చెన్నై రెడ్ హిల్స్ ప్రాంతంలోని హోటల్ లో పనిచేస్తూ అక్కడ వ్యక్తులకు గంజాయిని అధిక ధరలకు విక్రయించడానికి తీసుకెళుతున్నానని తెలిపారు. ఎవరైనా అక్రమంగా గంజాయిని తరలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సెబ్ సిబ్బంది మోసెస్, విజయ్ కుమార్, కిరణ్ సింగ్, కృష్ణయ్య, ఆనంద్ బాబు, గౌస్ బాషా, రవి, రాం ప్రసాద్, నారాయణ, బాల వర్ధన్ రావు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్ : ఏర్పేడు మండలంలోని చింతలపాలెం గ్రామం దళితవాడకు చెందిన జి.చెంగయ్య కుమారుడు జి. తిరుమల (33) సెప్టిక్ ట్యాంక్ డ్రైవర్ గా పనిచేస్తుంటాడు. రెండు రోజుల క్రితం ఇంట్లో చెప్పి బయట కు వెళ్లి తిరిగి రాక పోవడంతో ఆందోళన చెందిన తిరుమల తల్లిదండ్రులు ఏర్పేడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టణ సమస్యలు పరిష్కరించండి

- కమిషనర్ టిడిపి నాయకుల వినతి

కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణ పరిధిలోని సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ కమిషనర్ వెంకటేశ్వర రావుకు టిడిపి జిల్లా అధికార ప్రతినిధి చెంచురామయ్య బుధవారం వినతిపత్రం అందించారు. గూడూరు పట్టణ టిడిపి కమిటీ నాయకులు పట్టణ పరిధిలో ఇటీవల పర్యటించి ప్రధాన సమస్యలు గుర్తించారు . వీటిని పరిష్కరించాలని కోరుతూ టిడిపి నాయకులు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ను కలిసి ప్రధాన సమస్యలు వివరిం చారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధికార ప్రతినిధి చెంచు రామయ్య మాట్లాడుతూ గూడూరు పట్టణ పరిధిలోని శివారు ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు లేక ఆ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారని, పట్టణ పరిధి కాలువల్లో సిల్టు తొలగింపు చేపట్టాలని, దోమల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు శ్రీనివాసులు, టిడిపి నాయకులు ఇజ్రాయిల్‌కుమార్, అబ్దుల్ రహీమ్ పా ల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాల్టీ పరిధిలో గోవిందపాళ్యెం సమీపంలోని చెత్త సేకరణ డంపింగ్ యార్డును మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎం రెడ్డి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన నాయుడుతో కలిసి బుధవారం పరిశీలించారు. వ్యర్థాలతో నిండి పోవడంతో చెత్త సేకరించిన తర్వాత కాంపాక్టర్లు, ట్రాక్టర్లు అన్‌లోడ్ చేసేందుకు ఇబ్బందికర పరిస్థితి లేకుండా జెసిబితో చదును చేసే పనులు నిర్వహించారు.

ట్రిపుల్ ఐటీకి తిరుపతి విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి ఆటో నగర్ ఆర్.జీ కాలనీ లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్ కే సిరీన్ ఇటీవల విధుడులైన ఫలితాలలో విజయం సాధించి నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్రయ్య తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ పాఠశాల నుంచి విద్యార్థిని ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు పివిఎల్ రమాదేవి హర్షం వ్యక్తం చేశారు.

శ్రీ చైతన్య విద్యార్థుల 'గ్రీన్ ఇండియా మిషన్'

మొక్కలు నాటుతున్న ఆర్‌డివో కుసుమ, శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం సురేష్

ప్రజాశక్తి- తిరుపతి: శ్రీ చైతన్య పిపిఎల్ బ్రాంచ్‌లో 'గ్రీన్ ఇండియా మిషన్' కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో చైతన్యాన్ని కల్పించేందుకు శ్రీ చైతన్య పాఠశాల నుండి విద్యార్థులతో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు అందరూ తమ వంతు బాధ్యతగా వారె మొక్కలు తెచ్చి నాటుతూ సమాజానికి తమ వంతు బాధ్యతను తెలియపరిచారు. ఈ కార్యక్రమం ద్వారా పచ్చదనం పై శ్రీచైతన్య విద్యార్థులు సమాజానికి అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీవో కుసుమ, శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సురేష్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని చెట్ల పెంపకం దాని ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించి పచ్చదనం పరిశుభ్రత పట్ల గట్టి కృషి చేయాలని నేటి బాలలే రేపటి పౌరులు అని, సమాజం విద్యార్థుల చేతిలో ఉందని అవగాహన కల్పించా రు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ , ఏవో రవి బాబు , డీన్, ఇన్‌ఛార్జులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయు లు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

హేమంత్‌కి టిడిపి నాయకుల నివాళి

ప్రజాశక్తి- రామచంద్రాపురం: మండలంలోని అనుపల్లి పంచాయతీ రేకల చేను గ్రామానికి చెందిన టిడిపి సానుభూతిపరుడు పచ్చార్ల హేమంత్ (31) గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న రామచంద్రాపురం మండల టిడిపి అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఉదయం మృతుని స్వగ్రామం రేకల చేను గ్రామానికి చేరుకొని హేమంత్ భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి విజయానికి హేమంత్ కష్టపడ్డారని కొనియాడారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బిందు మాధవి, బండి విజయ్ కుమార్ రెడ్డి, కొర్లకుంట నర్సింహారెడ్డి, గద్దల గుణసుందరి, గుర్రం దేవరాజు రెడ్డి, బండి రమణారెడ్డి, జవాజి ప్రకాష్ పాల్గొన్నారు

పన్ను చెల్లింపు దారులకు స్లాబులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - క్యాంపస్ : పన్ను చెల్లింపుదారులకు పన్ను స్లాబులపై పూర్తిస్థాయిలో అవగాహన అత్యవసరమని ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేశ్ సామ్రాట్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో లోని శ్రీనివాస ఆడిటోరియంలో "ఇన్‌మమ్ టాక్స్ ఔట్రీచ్ ప్రోగ్రాం" కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది చార్టెడ్ అకౌంట్ విద్యార్థులు పూర్తిస్థాయిలో సబ్జెక్టు పై అవగాహన పెంచుకొని పన్ను రకాల గురించి క్షుణ్ణంగా అభ్యసనం చేయాలని సూచించారు. వివిధ రంగాలలో ఉద్యోగాలు ప్రభుత్వ ఉద్యోగాలు ప్రైవేట్ ఉద్యోగాలు నిర్వహించే ఉద్యోగులు పన్ను స్లాబుల గురించి పూర్తిస్థాయిలో అవగాహన అవసరం అన్నారు. ఆదాయపు పన్ను అధికారులు ఈ అంశంపై పరిగణలోకి తీసుకొని ఎస్వీయూ అధికారులు ముఖ్యంగా ఆచార్య హోదాను గుర్తించి, వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం ద్వారా సమర్థవంతంగా పన్నులు చెల్లించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ టీవీ వంశీధర్, చార్టెడ్ అకౌంటెంట్లు ఫల్గుణ కుమార్, రవీంద్రారెడ్డి, ఆదాయ పన్ను అధికారులు, సిబ్బంది, అధ్యాపకులు, చార్టెడ్ అకౌంటెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

సందేశాత్మకం నాటకోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న నాటకోత్సవాలు సందేశాత్మకంగా సాగుతున్నాయి. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, న్యూఢిల్లీకి చెందిన భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి అమరావతి వారి సంయుక్త సహకారంతో అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో హనుమ అవార్డ్స్ జాతీయ నాటకోత్సవాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. అందులో భాగంగా స్థానిక మహతి ఆడిటోరియంలో బుధవారం జరిగిన నాటకాలు సందేశాత్మకంగా సాగాయి. గుడివాడకు చెందిన శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ కళాకారులచే మళ్లీ కలిసి జీవిద్దాం సాంఘిక నాటికను ప్రదర్శించారు. అనంతరం విశాఖపట్నం కి చెందిన తెలుగు కళా సమితి కళాకారులచే నిశబ్దమ నీ ఖరీదంత సాంఘిక నాటికను, విజయనగరం జిల్లా రాజ్యాం కు చెందిన కళాసాగర నాటక సంక్షేమ సేవా సంఘం కళాకారులు శ్రీకాళహస్తి మహిత్యం పద్య నాటికలు ప్రదర్శించారు. నాటక ప్రదర్శనలు సందేశాత్మంగా సాగడంతో ప్రేక్షకులను ఆలోచింపజేసాయి. ఈ కార్యక్రమంలో బియన్ రెడ్డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

బాబు దార్శనికత వల్లే బడ్జెట్‌లో ఏపీకి నిధులు

- ఈ శివకోటీశ్వర రెడ్డి

ప్రజాశక్తి రామచంద్రాపురం(చంద్రగిరి): కేంద్ర బడ్జెట్ లో ఏపీకి భారీ నిధులు కేటాయింపులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు నిదర్శనమని టిడిపి సీనియర్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్, రాష్ట్ర రైతు కార్యదర్శి ఈశ్వరవాక శివ కోటీశ్వర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్ లో ఏపీకి ప్రత్యేక నిధులు సాధించటానికి కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భారీ నిధులు కేటాయింపుపై హర్షం వ్యక్తం చేశారు. కూటమి నాయకులు ఉమ్మడిగా చర్చించి రాష్ట్రాన్ని ఆదుకోవాలని కోరారు.రాజధాని అమరావతికి 15 వేల కోట్ల నిధులు అమరావతి అభివృద్ధి చెందుతుందని, పోలవరం పూర్తయితే రాష్ట్రం సస్య శ్యామలమవుతుందన్నారు. ఏపీలో పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం ఇవ్వటం వల్ల పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. మహిళల అభివృద్ధికి మూడు లక్షల కోట్లు కేటాయించడం ఆనందదాయకమన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని నెల రోజులలోపే ప్రధాన సమస్యలైన గోవిందధామం, గుంతల మయమైన శ్రీవారిమెట్టు రహదారికి రోడ్డు నిర్మాణం, ఎన్నో ఏళ్లుగా ఆగిపోయిన ఆర్టీసీ బస్సులు పునఃప్రారంభించారన్నారు. గతంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తుడా నిధులతో పనికిమాలిన బల్లలు వేశారే తప్ప చంద్రగిరి నియోజకవర్గానికి చేసింది శూన్యమని ఎద్దేవా వేశారు. చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

అనుమతులు లేకుండా విక్రయిస్తే లైసెన్సు రద్దు..

సహాయక వ్యవసాయ సంచాలకుల హెచ్చరిక

ప్రజాశక్తి - సత్యవేడు: ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు ప్రభుత్వ అనుమతుల మేరకే విక్రయించాలని అధిక ధరలకు విక్రయించకూడదని రైతు కొనుగోలుకు విధిగా బిల్లులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ అనుమతులకు విరుద్ధం గా వ్యవహరించే డీలర్ల దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. సత్యవేడు మండల కేంద్రం వ్యవసాయ శాఖ కార్యాలయంలో డివిజన్ సహాయక వ్యవసాయ సంచాలకులు జె సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఇన్‌పుట్ డీలర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి ఆర్ మురళి మాట్లాడుతూ విత్తనాలు ఎరువులు పురుగు మందులకు సంబంధించిన విక్రయాలు మధు రైతు డిపో, వినాయక కిసాన్ సెంటర్ సత్యవేడు, ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కమిటీ లిమిటెడ్ లక్ష్మి క్లాస్ అండ్ జనరల్ స్టోర్ శక్తి వినాయక రైతు డిపో, సాయి రైతు డిపోలలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ సేవలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. రైతుల అవశ్యకార్థం వరి పంట సాగు ప్రారంభించే నాటికి మరికొన్ని మరి కొన్ని నూతన దుకాణాలకు లైసెన్సులు ఇచ్చి అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ వారి కోర్టులో
O.S.No.87/2021

Kovi Janardhan ...వాది
Vs
1.Chunduru Vijayamma and others ...ప్రతివాదులు

To
D3: Chunduru Arun Kumar, S/o. Late Raghuramaiah
D4: Chunduru Supriya, D/o. Late Raghuramaiah, D.No.1/421, M.V. Nagar, Guduru Town, Tirupati.

పై నెంబరులోని వాది తన ప్రొనోటు బాకీ రాబట్టుకొనుటకు గాను దావా దాఖలు చేసినందున 3వ మరియు 4వ ప్రతివాదుల నోటీసులకు గాను తేది: 08.08.2024న వాయిదా వేసియున్నారు. కావున పై దావా విషయమై 3వ మరియు 4వ ప్రతివాదులకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల పైకోర్టు ఎదుట పై తేదీన ఉదయం 10:30 గం॥లకు హాజరై తెలుపుకొనవలెయును. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియజేయడమైది.

ఇట్లు
పి.వి. సాయికుమార్ రెడ్డి
వాది తరపు న్యాయవాది, గూడూరు